

కూనామహాలక్ష్మినగర్ రోడ్డు..


రింగ్ బస్తీలో..

నిలిచిన బస్తీరోడ్ల నిర్మాణ పనులు !


కూనామహాలక్ష్మినగర్ రోడ్డు..


రింగ్ బస్తీలో..

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని పలు బస్తీల్లో ఎన్నో ఏళ్లుగా ఉన్న డ్రైనేజీ సమస్యను తీర్చిన అధికారులు రోడ్లు వేయడంలో మాత్రం ఆలస్యం చేస్తున్నారు. రోడ్డు పనులు ప్రారంభించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా సంజయ్‌పురికాలనీ, కూనా మహాలక్ష్మినగర్, జగద్గిరినగర్, రింగ్ బస్తీలలో ఈ సమస్య ఎక్కువగా ఉంది. డ్రైనేజీ పనులు పూర్తిచేసి సుమారు 6 నెలల నుంచి ఏడాది అవుతున్నా.. రోడ్డు పనులు మాత్రం ప్రారంభించకపోవడం విశేషం. ఈ అంతర్గత రోడ్లు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై గాజులరామారం ఏఈ తిరుపతిని వివరణ కోరగా.. ఈ రోడ్లకు టెండర్ ప్రక్రియ పూర్తి అయ్యిందని, ఈ వారంలోనే అన్ని పనులు ప్రారంభం అవుతాయని వివరించారు.

కలుషితమవుతున్న తాగునీరు

● రోడ్లపైనే వృథాగా వదిలేస్తున్న వైనం ● నీటి పొదుపుపై అవగాహన కల్పించని అధికారులు


వివేకానందనగర్ డివిజన్‌లో వృథాగా పారుతున్న తాగునీరు


ఆల్విన్‌కాలనీలో రోడ్డుపై ఇలా..

ఆల్విన్‌కాలనీ: అధికారుల నిర్లక్ష్యం కారణంగా తాగునీరు లీకేజీ అయ్యి రోడ్డు పాలవుతోందనే ప్రజలు వాపోతున్నారు. ప్రజాధనం దుర్వినియోగమవడంతో పాటు తాగునీటిలో మురుగు చేరి కలుషిత నీరు సరఫరా అవుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

◆ అసలే శీతాకాలంలో విషవ్యాధులతో పాటు దగ్గు, దమ్ము, జలుబు వంటి వ్యాధులు ప్రబలుతుండటంతో స్థానికులు అయోమయానికి గురవుతున్నారు. సీజనల్ వ్యాధులతో ఆసుపత్రుల పాలవుతున్నారు.

◆ కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని జగద్గిరిగుట్ట, రిక్షాపుల్లర్స్ కాలనీ, ప్రగతినగర్, ఆస్‌బెస్టాస్ కాలనీ, ఆల్విన్‌కాలనీ, రామకృష్ణనగర్ తదితర కాలనీల్లో పైపులైన్లు పగిలి వాల్వ్ లీకేజీతో తాగునీటిలో మురుగు నీరు చేరి కలుషిత నీరు సరఫరా అవుతోందని ప్రజలు వాపోతున్నారు.

◆ కొన్ని కాలనీల్లో తాగునీటి పైపులైన్ పగిలి రోడ్డు మీదే తాగునీరు వృథాగా ఏరులై పారుతున్నాయని పేర్కొంటున్నారు. సంబంధిత సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే కొన్ని నెలలుగా తాగునీరు లీకేజీ ద్వారా రోడ్లపాలవుతున్నా తమకేమి పట్టనట్లుగా నీటిని విడుదల చేసి చేతులు దులుపుకుంటున్నారని పలువురు వాపోతున్నారు.

◆ ప్రశ్నించిన వారితో దురుసుగా ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రిక్షాపుల్లర్స్ కాలనీలో తాగునీరు విడుదల చేసినప్పుడు స్థానికులు సరిపడ నీరు పట్టుకుని కులాయిలను కట్టేయాల్సింది పోయి రోడ్లపై వృథాగా వదిలివేస్తున్నారని విమర్శలున్నాయి. దీంతో వేల గ్యాలన్ల తాగునీరు వృథాగా పోతోందని స్థానికులు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు తాగునీటి పట్ల అవగాహన కల్పించకుండా చోద్యం చూస్తున్నారని చెబుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి సీజ్ చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్‌లైన్ల నిర్వహణ నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కొంపల్లి ఏఈ వినాయక్ రాథోడ్ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ నూజివీడు సీడ్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎంఎన్‌కే వీటుస్ విల్లాస్, దూలపల్లి రోడ్డు, నాగార్జున హోమ్స్, నూజివీడు సీడ్స్ రోడ్డు, అశ్వన్‌కాలనీ, బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ అపార్ట్‌మెంట్స్, అపర్ణ రెండోగేటు, శాంతినికేతన్ విల్లాస్ తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

సుభాష్‌నగర్: 11కేవీ ఫీడర్ లైన్ మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉందని గాజులరామారం సెక్షన్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కైసర్‌నగర్, దేవేందర్‌నగర్, బతుకమ్మబండ, రావినారాయణరెడ్డినగర్, నరసింహబస్తీ, ఒక్షిత్ హిల్‌వ్యూ, జీఎస్ఎస్‌యూఆర్ఎం, పోచమ్మ బస్తీ, ఉషోదయ కాలనీ ఫేజ్-1, వేంకటేశ్వర గార్డెన్, గాజులరామారం, ఆదర్శ నగర్‌కాలనీ, శివసాయిహిల్స్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

ట్రాఫిక్ నియంత్రణ చర్యలు


రోడ్డుపై అమర్చిన బొల్లార్డ్స్

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నిత్యం ట్రాఫిక్‌తో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో అధికారులు ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టారు. బాలానగర్ నుంచి వచ్చే వాహనాల వైపు బొల్లార్డ్స్ నిర్మించడంతో కొంత ట్రాఫిక్ సమస్య తీరినట్లైంది.

ప్రమాదకరంగా కల్వర్టు !


హెచ్ఎంటీ పైప్‌లైన్ రోడ్డులో కల్వర్టు ఇలా..

జగద్గిరిగుట్ట: హెచ్ఎంటీ పైప్‌లైన్ రోడ్డులో ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా మారింది. రోడ్డుకు సమాంతరంగా ఉండటంతో ఆ కల్వర్టు దగ్గరకు వచ్చే వరకు కనిపించకపోవడం పలు ప్రమాదాలకు కారణమవుతోంది. ఇంతకు ముందు ఈ కల్వర్టు సమీపంలో ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దారిన పోయేవారు వ్యర్థాలను పారవేయడంతో ఆ ఫెన్సింగ్ కాస్తా లేకుండా పోయింది. నిత్యం వందలాది వాహనాలు వెళ్లే ఈ దారిలో ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం !


సంజయ్‌గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాల రోడ్డుపై ఇలా..

రంగారెడ్డినగర్: పారిశుద్ధ్య నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రధాన రోడ్లపై చెత్త పేరుకుపోతోంది. జంట సర్కిళ్ల పరిధిలో రోజువారీ పారిశుద్ధ్య నిర్వహణకు 850 మంది సిబ్బంది ఉన్నా.. ఎక్కడి చెత్త అక్కడే అన్న చందంగా మారింది. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి సంజయ్‌గాంధీనగర్‌లోని శ్మశానవాటిక నుంచి ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే రోడ్డు వ్యర్థాలతో నిండిపోయింది. దీనిపై స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని విమర్శలున్నాయి. స్థానికంగా ఉన్న చర్చి సమీపంలోనూ అపరిశుభ్ర వాతావరణం నెలకొంది.

ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత అధికారులదే..

రెవెన్యూ అధికారుల సమావేశంలో జిల్లా కలెక్టర్ గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులు తప్పకుండా తీసుకోవాలని, ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్నిరకాల సహకారం అధికార యంత్రాంగం నుంచి ఉంటుందని మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. జిల్లాలో ఎక్కడ కూడా ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని, తహసీల్దార్లు తమ విధులను సజావుగా నిర్వహించాలని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియతో కలిసి తహసీల్దార్లతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో ప్రస్తుతం ఎక్కడైనా ప్రభుత్వ భూములు ఇతరుల స్వాధీనంలో ఉన్నట్లయితే.. వెంటనే నోటీసులు జారీచేసి వాటిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. జిల్లాలో ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములు ఉన్నాయనే వివరాలను తెలుసుకుని, వాటిని ఎవరైనా కబ్జా చేసినట్లయితే వెంటనే పోలీసు బలగాలతో సంబంధిత ప్రదేశంలోని ప్రభుత్వ భూమి అని సూచించేలా బోర్డు ఏర్పాటు చేయటంతో పాటు కంచె ఏర్పాటు చేయాలని తహసీల్దార్లకు ఆయన సూచించారు.

సమగ్ర సమాచారంతో..

ప్రభుత్వ భూములను కబ్జా చేసిన ఆక్రమణదారులు ఇబ్బందులకు గురిస్తే చేస్తే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. రెవెన్యూ అధికారులతో 15 రోజులకోసారి అన్ని విషయాలపై సమీక్ష సమావేశాలు ఉంటాయని, ప్రభుత్వ భూములపై సమగ్ర సమాచారంతో ఉండాలని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో తహసీల్దార్లు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా, సానుకూలంగా స్పందించి, పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ అధికారులకు అన్ని విషయాల్లో అండగా ఉంటామని భరోసా కల్పించారు. ప్రభుత్వ సూచనలు పాటిస్తూ తమ విధులు సక్రమంగా నిర్వర్తించి ప్రభుత్వ భూములు ఆక్రమించకుండా చూడాలని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్డీవోలు రాజేష్ కుమార్, శ్యామ్ ప్రకాశ్, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదు కేంద్రం

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని భూదేవిహిల్స్‌లో బాలకృష్ణ స్కూల్‌లో ఆధార్‌నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఒకరోజు మాత్రమే ఈ కేంద్రం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు ప్రకటించారు. ఆధార్ నమోదుతో పాటు పేర్లు, ఇంటి అడ్రస్ మార్పులు వంటివి చేసుకోవచ్చని వివరించారు.

కనుల పండువగా శివకల్యాణం



మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని శ్రీహరిహరక్షేత్రంలో కార్తీకమాస ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి శివకల్యాణం కనుల పండువగా నిర్వహించారు. అర్చకులు కృష్ణసూరి సమక్షంలో ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు, పూజలు అనంతరం రాత్రి కాశీ విశాలాక్షి విశ్వేశ్వర స్వామి కళ్యాణం వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కల్యాణాన్ని వీక్షించారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు.

మనూ-మై చాయిస్ మధ్య ఒప్పందం

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ విమెన్ ఎడ్యుకేషన్, మై చాయిస్ ఫౌండేషన్‌ల మధ్య అవగాహన ఒప్పందాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ సమక్షంలో రెండు సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. రిసోర్స్‌పర్సన్లు డాక్టర్ ఫర్హానా ఖాన్, ఆపరేషన్స్ హెడ్, డాక్టర్ అనితా సేబుల్, ఐసీసీ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ గుల్ఫిషా న్‌హబీబ్, మహిళా విద్యావిభాగం అధిపతి ప్రొఫెసర్ అమీనా తహసీన్ పాల్గొన్నారు.

విభిన్న సంస్కృతులకు నిలయం హైదరాబాద్


ఎమ్మెల్యే వివేకానంద్‌ను సత్కరించిన స్వాములు

కుత్బుల్లాపూర్: హైదరాబాద్ నగరం విభిన్న సంస్కృతులకు నిలయమని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సుభాష్‌నగర్ డివిజన్ ఫాక్స్‌సాగర్ సమీపంలోని రాధాకృష్ణ ఆలయంలో ఒడియా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఒడియా అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేను సత్కరించి రాధాకృష్ణ ఆలయ నిర్మాణానికి ఆయన సహకారం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

◆ కుత్బుల్లాపూర్‌లో అరుణ్ గురుస్వామి పర్యవేక్షణలో గురుస్వామి హరిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై పూజలు నిర్వహించారు.

◆ వెటరన్ అథ్లెటిక్, ఎం.ఎల్.అర్ కళాశాలల అధినేత మర్రి లక్ష్మణ్‌రెడ్డి పేట్‌బషీరాబాద్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్యే వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హ్యాట్రిక్ విజయం సాధించి రాష్ట్ర రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు.

భార్య పుట్టింటి నుంచి రాలేదని ఆత్మహత్య


శివకిరణ్ (ఫైల్)

కుత్బుల్లాపూర్: పుట్టింటికి వెళ్లిన భార్య ఇంటికి రాలేదని మనస్తాపంలో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ శ్రీరామ్‌నగర్‌కు చెందిన శివకిరణ్ (31) స్కూల్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. కాగా ఇటీవల అతని భార్య ఝాన్సీకి డెలివరీ కాగా ఫతేనగర్‌లోని పుట్టింటికి వెళ్లింది. ఈనెల 11న రాత్రి 8.30 గంటల సమయంలో ఫతేనగర్‌కు వెళ్లిన శివకిరణ్ తన భార్యను ఇంటికి పంపాలని అడిగాడు. మూడు నెలల తరువాతనే వస్తానని భార్య చెప్పడంతో ఇద్దరి మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. శ్రీరామ్‌నగర్‌లోని ఇంటికి వచ్చిన శివ తన తల్లి అరుంధతితో కలిసి రాత్రి భోజనం చేసి ఆపై నిద్రకు ఉపక్రమించారు. మంగళవారం ఉదయం 7.30 గంటలకు అతని చెల్లెలు నిద్ర లేపేందుకు తలుపులు తట్టగా.. ఎంతకీ తెరవలేదు. దీంతో చుట్టుపక్కల వారి సాయంతో తలుపులు తెరిచి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అవగాహన ఒప్పందం



నిజాంపేట్: బాచుపల్లిలోని వీఎన్ఆర్ వీజేఐఈటీ కళాశాల 'టై హైదరాబాద్' సంస్థతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. టై గ్రాండ్ ప్లస్ గ్లోబల్ చైర్‌పర్సన్ డాక్టర్ భానుప్రకాష్, డాక్టర్ బాలాజీ, పార్టనర్ వివేక్‌వర్మ, సింప్లీబిజ్ అంకుర సంస్థ వ్యవస్థాపకుడు రఘుబాబు పాల్గొనగా.. కళాశాల తరఫున డాక్టర్ సీడీ నాయుడు, సంచాలకులు చెన్నకేశవరావు, డీన్ పద్మశాయి, వీజే హబ్ మేనేజర్ చక్రవర్తుల కిరణ్‌లు పరస్పర అవగాహన ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల మెంటర్లుగా వ్యవహరిస్తున్న వివేక్ వర్మ, రఘుబాబులు మాట్లాడుతూ.. విద్యార్థులు అంకురాల స్థాపనను తమ కెరీర్‌గా మలచుకోవాలన్నారు. అనంతరం భానుప్రకాష్ మాట్లాడుతూ.. తమ బార్‌ట్రానిక్స్ సంస్థ ద్వారా టీటీడీకి సుదర్శన టోకెన్ల వ్యవస్థను నెలకొల్పిన విషయాన్ని తెలియజేశారు. రోహిత్‌రెడ్డి, శ్రీచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రిజర్వాయర్ పైకప్పు


షాపూర్‌నగర్‌లో పంపుహౌజ్ మోటార్లను పరిశీలిస్తున్న జీఎం శ్రీధర్‌రెడ్డి


షాపూర్‌నగర్ రిజర్వాయర్ వద్ద పైకప్పు

చింతల్: రిజర్వాయర్లపై పర్యవేక్షణ నిరంతరం ఉండాలని కుత్బుల్లాపూర్ వాటర్‌వర్క్స్ జీఎం శ్రీధర్‌రెడ్డి అన్నారు. షాపూర్‌నగర్ సబ్ డివిజన్ పరిధిలోని షాపూర్‌నగర్ రిజర్వాయర్లు, కైసర్‌నగర్ రిజర్వాయర్లతో పాటు షాపూర్‌నగర్ సెక్షన్లలో డీజీఎం అప్పలనాయుడు, వివిధ సెక్షన్ మేనేజర్లు రోహిణి, రమ్యభారతి, అనూషలతో పాటు పర్యటించి ప్రజలకు అందుతున్న నీటిసరఫరా నాణ్యతలను పరిశీలించారు. సరఫరా అవుతున్న నీరు, పంపింగ్ అవుతున్న నీటిని పరీక్షించారు. అనంతరం రిజర్వాయర్ల పంపుహౌజ్ వద్ద మోటార్లను పరిశీలించారు. షాపూర్‌నగర్ జీఎల్ఎస్ఆర్ రిజర్వాయర్ పైకప్పు పెచ్చులూడుతున్న పైకప్పును పరిశీలించిన అనంతరం నూతన పైకప్పు వేసేందుకు అంచనాలు రూపొందించాలని సబ్ డివిజన్ డిజీఎం అప్పలనాడు, మేనేజర్లకు సూచించారు. త్వరితగతిన టెండర్లను పిలిచి పైకప్పు మార్చనున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపాలి


మాట్లాడుతున్న జయంత్ చల్లా

నిజాంపేట్: చదువుకునే పిల్లలు ఫోన్లు, సోషల్ మీడియాకు దూరంగా ఉండి చదువులపై శ్రద్ధ చూపాలని జయంత్ చల్లా విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఆటా ఆధ్వర్యంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని బాచుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన లైబ్రరీని మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తాము కూడా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకుని ఉన్నతంగా ఎదిగామని, ఇక్కడి విద్యార్థులు కూడా అలానే ఎదగాలని ఆకాంక్షించారు. స్కూల్, ఆటాకు మధ్య సమన్వయకర్తగా వ్యవహరించిన జ్యోష్నన్ను బొబ్బాలను అభినందించారు. వేణు సంకినేని, ఆటా సెక్రటరీ రామకృష్ణారెడ్డి అల, ఆటా కోశాధికారి సతీష్‌రెడ్డి, 18వ ఆటా కాన్ఫరెన్స్ నేషనల్ కో- ఆర్డినేటర్ సాయిసుధిని, ఆటా జాయింట్ ట్రెజరర్ రవీందర్ గూడూరు, మీడియా కో - ఆర్డినేటర్ ఈశ్వర్ బండా, కరుణాకర్ మాధవరం, ఆటా బోర్డు ఆఫ్ ట్రస్టీస్ నరసింహారెడ్డి, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గడ్డం ప్రసాద్‌కు సత్కారం



నిజాంపేట్: తెలంగాణ శాసన సభ స్పీకర్‌గా పదవీబాధ్యతలు చేపట్టనున్న గడ్డం ప్రసాద్‌ను మంగళవారం నిజాంపేట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఆయన మాట్లాడుతూ.. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభలో టెక్స్‌టైల్స్ మినిస్టర్‌గా ఆయన సేవలందించారని, స్పీకర్‌గా గౌరవం దక్కడం సంతోషకరమన్నారు. జూలకంటి లక్ష్మారెడ్డి, శ్రీనివాసరావు తదితరులున్నారు.

ప్రత్యేక పూజలు




పేట్‌బషీరాబాద్ కట్టమైసమ్మ


జగద్గిరిగుట్ట కొండపై ఉన్న అమ్మవారి దర్శనం

జగద్గిరిగుట్ట: అమావాస్యను పురస్కరించుకుని డివిజన్ పరిధిలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మగ్దూంనగర్‌లోని బొడ్రాయి వద్ద కార్పొరేటర్ జగన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగద్గిరిగుట్ట కొండపై ఉన్న కాళికామాత ఆలయంలో అమ్మవారికి అభిషేకం, అలంకరణ చేసి భక్తులకు అన్నదానం చేశారు.

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ పేట్‌బషీరాబాద్‌లోని శ్రీ కట్టమైసమ్మ ఆలయంలో మంగళవారం అమావాస్యను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు చెందిన శేషు కుటుంబసభ్యులు మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఆలయ చైర్మన్ వివేక్‌రెడ్డి భక్తులకు తగిన ఏర్పాట్లు చేశారు.

కుత్బుల్లాపూర్: నర్సాపూర్‌లోని శ్రీచాకరిమెట్ల ఆంజనేయస్వామిని ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు శంభీపూర్‌రాజు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నాగరాజు యాదవ్, కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, మల్లంపేట్ కౌన్సిలర్ అర్కల అనంతస్వామి, జిన్నారం వెంకటేష్‌గౌడ్, కర్నెకంటి మల్లేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మానసిక వికాసం


పాఠశాల ఏజీఎం వైజయంతి, కో- ఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట్: పుస్తకాల పఠనంతో విద్యార్థుల్లో మానసిక వికాసం పెంపొందుతుందని నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్ శరణి అన్నారు. మంగళవారం ప్రగతినగర్ నారాయణ ఒలంపియాడ్ స్కూల్‌లో నిర్వహించిన ×విద్యా నైపుణ్యాల- నైతిక విలువలు÷ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా శరణి మాట్లాడుతూ.. విద్యార్థులు తమ నైపుణ్యాలను ఇతరులతో పంచుకోవడం ద్వారా సరికొత్తగా ఆలోచించేందుకు అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులు మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు చదువుతో పాటు ఆటలపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం !


కొంపల్లి 1వ వార్డులో పారిశుద్ధ్యంపై ఆరా తీస్తున్న మున్సిపల్ చైర్మన్ శ్రీశైలంయాదవ్

కుత్బుల్లాపూర్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటామని కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని 1వ, 2వ, 3వ వార్డుల్లో పర్యటించిన ఆయన స్థానికంగా నెలకొన్న పారిశుద్ధ్య సమస్యపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజూవారీగా చెత్తచెదారాలను తరలిస్తే ఇబ్బందులు తలెత్తవని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రజలు రోగాల బారిన పడతారన్నారు. మున్సిపల్ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణకు పెద్దపీట వేస్తూ.. ముందుకు సాగుతున్నామన్నారు.